క్లుప్తంగా

మురుగు నీటిని తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: బైపాస్ రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఫౌంటెయిన్‌లోని మురుగు నీటిని మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు. ఫౌంటెయిన్‌లో మురుగు నీటి నిలవ్వతో దుర్గంధం వెదజల్లుతుండటంపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించిన మున్సిపాలిటీ సిబ్బంది ఫౌంటెయిన్‌లోని మురుగు నీటిని తొలగించి, ట్యాంకర్‌తో నీటిని నింపి ట్యాంకర్‌ను వినియోగంలోకి తెచ్చారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



డోర్నకల్: స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నూకల అభినవ్‌రెడ్డి, డోర్నకల్ సీఐ చంద్రమౌళి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.దేవ్‌సింగ్, బి.అశోక్‌కుమార్, పరకాల స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కొప్పుల శంకర్, సీనియర్ లిఫ్టర్లు రాంకోటేష్, మారబోయిన లక్ష్మీనారాయణ, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్



కేసముద్రం: అస్సాం రాష్ట్రం గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6నుంచి 19 వరకు నిర్వహించనున్న ప్రపంచ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలు జరగనున్నాయి. కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ ఈ పోటీలకు టెక్నికల్ అఫిషియల్‌గా వ్యవహరించనున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు రమేష్‌కుమార్, రమేష్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగు రోజులుగా మున్నేరులో మృతదేహం

ఖమ్మంక్రైం/డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన వ్యక్తి నాలుగు రోజుల క్రితం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆకేరులో పడి గల్లంతయ్యాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో మున్నేరు ఉధృతి పెరగడంతో గల్లంతైన వ్యక్తి మృతిచెందగా.. ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ చప్టా వద్ద గల సుడిగుండంలో చిక్కుకుని అక్కడే తిరుగుతున్న మృతదేహాన్ని త్రీటౌన్ పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం నుంచి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నా మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అక్కడికి వెళ్లేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. దీంతో ఆదివారం ఉదయం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు అగ్నిమాపక, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం అందించగా వారు కూడా సాయంత్రం వరకు ప్రయత్నించినా మృతదేహం ఉన్న ప్రాంతానికి చేరుకోలేకపోతున్నారు. రెండు పెద్ద క్రేన్ల ద్వారా వెళ్లినా సాధ్యం కాలేదు.

రాత్రంతా అక్కడే కాపలా..

గల్లంతైన వ్యక్తి డోర్నకల్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు(43)గా పోలీసులు గుర్తించడంతో అతడి భార్య విజయ, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ మున్నేటి ఒడ్డుకు చేరుకుని శనివారం సాయంత్రం నుంచి అక్కడే రోదిస్తూ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తారేమోనని ఎదురుచూస్తున్నారు. కాగా, ఆదివారం రాత్రి 7గంటల సమయంలో మృతదేహం ప్రకాశ్‌నగర్ నుంచి కొట్టుకుపోయిందని, అది ఎక్కడ తేలేది తెలియదని సీఐ మోహన్‌బాబు వెల్లడించారు. గల్లంతై నాలుగు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. మృతదేహం కొట్టుకుపోయిందని తెలియడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

గూడూరులో నేడే సద్దుల బతుకమ్మ

గూడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం (నేడే) సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని పూజారులు వేణుగోపాలాచార్యులు, సతీష్‌పాండ్యే, అశీష్‌పాండ్యే, నరేష్‌శాస్త్రి తెలిపారు. ఆచారం ప్రకారం సద్దుల బతుకమ్మ 9వ రోజు సోమవారమే జరుపుకోవాలని మండల ప్రజలకు తెలియజేశారు.

వేతనాలు చెల్లించాలి

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్, స్కావెంజర్స్ వర్కర్స్ పెండింగ్ వేతనాలను చెల్లించి ఆదుకోవాలని స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్కావెంజర్లకు రూ.15వేలకు పెంచి వేతనాలు అందించాలని కోరారు.

వీధుల్లో పేరుకుపోతున్న చెత్త

- షెడ్డుకే పరిమితమైన చెత్త వాహనాలు
- పండుగ వేళ పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల ఇబ్బందులు



జెడ్పీ స్కూల్ మార్గంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

డోర్నకల్: బతకమ్మ పండుగ, శరన్నవరాత్రుల వేళ డోర్నకల్ మున్సిపాలిటీ ప్రజలు పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తను సేకరించే వాహనాలు వారాల తరబడి రాక వీధులు, ఇళ్లల్లో పేరుకుపోతున్న చెత్తతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రోజూ వర్షం పడుతుండడంతో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త కుప్పల వద్ద పందులు, పశువులు తిష్ట వేస్తుండడంతో దోమల బాధ పెరిగింది.

షెడ్లకు పరిమమితమైన వాహనాలు..

డోర్నకల్ మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత వీధుల్లో చెత్తను సేకరించేందుకు 2020లో మూడు ట్రాక్టర్లు, మూడు టాటాఏస్ వాహనాలను కొనుగోలు చేశారు. వాహనాలకు సకాలంలో ఇంజన్ ఆయిల్ పోయకపోవడం, మరమ్మతులకు గురైన సమయంలో సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో వాహనాలు శిథిలావస్థకు చేరుకున్నారు. రెండు ట్రాక్టర్లు, రెండు టాటాఏస్ ఆటోలు సంవత్సర కాలం క్రితం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. మరమ్మతులకు నిధులు లేకపోవడంతో వాహనాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఒక ట్రాక్టర్, ఒక ఆటో మాత్రమే పని చేస్తుండడంతో వీటితో కేవలం మేయిన్ రోడ్లులోనే చెత్తను సేకరిస్తున్నారు. వారాల తరబడి వీధులకు చెత్త వాహనాలు రాకపోవడంతో వీధులతోపాటు ఇళ్లలోనూ చెత్తపేరుకుపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల మరమ్మతులకు నిధులు లేకపోవడం, అరకొరగా ఉన్న జనరల్ ఫండ్ నిధులు సిబ్బంది జీతాలకు కూడా సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 11మంది వార్డు అధికారులు బదిలీపై సొంత శాఖలకు వెళ్లడంతో సిబ్బంది కొరతతో వార్డులలో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మున్సిపాలిటీలో ప్రతీ పనికి అవుట్ సోర్సింగ్ సిబ్బందిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్ది రోజుల్లో సద్దుల బతకమ్మ, దసరా పండుగ రానుండటంతో పారిశుద్ధ్య సమస్యలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్త సేకరణ వాహనాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని, మున్సిపాలిటీలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



గుర్తింపు కార్డు అందజేస్తున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: చేపల పెంపకం, విక్రయం మార్కెటింగ్ విధానంలో మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ముందుండాలని తెలంగాణ ఫిషర్మెంట్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్‌ముదిరాజ్ సూచించారు. నూతనంగా ఏర్పడిన మత్స్యమార్కెటింగ్ సహకార సంఘం సభ్యులకు ఆదివారం గుర్తింపు కార్డులను అందిజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మత్స్యకారులకు ప్రోత్సాహాలను అందజేస్తుందని, దానిని అందిపుచ్చుకుని అర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మహిళా మత్స్యకారులకు చేపల తయారు వంటకాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఉంటుందన్నారు. దీంతో మత్స్యకారులు ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పెద్ది సైదులు, పిడుగు వెంకన్న, పెద్ది రామనాథం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై పునరాలోచించాలి

గార్ల: గార్ల మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు మండల స్థాయి అధికారుల అవగాహన రాహిత్యంతో గందరగోళంగా ఉన్నాయని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ఆరోపించారు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. 2011 జనాభా లెక్కలను అధికారులు తూతూ మంత్రంగా పాటించారని, ఎంపీటీసీ రిజర్వేషన్ల మార్పుల్లో శాస్త్రీయత లేదన్నారు. గతంలో 2సార్లు జెడ్పీటీసీ ఎన్నికల్లో జనరల్ మహిళకు ఇచ్చారని, మళ్లీ 3వసారి జనరల్ మహిళకు ఎలా ఇస్తారని ఆయన జిల్లా అధికారులను ప్రశ్నించారు. మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్ల ఖరారులో జిల్లా అధికారులు మరోసారి పునరాలోచించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పండుగల నిర్వహణపై అయోమయం..!

నెహ్రూసెంటర్: సద్దుల బతుకమ్మ పండుగ నిర్వాహణ తేదీపై గందరగోళంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో మున్సిపాలిటీ ప్రకటించిన రెండు తేదీల ప్రకటనలను చూపిస్తూ ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ అధికారులు 29న అంటూ ఒక ప్రకటన, 30న అంటూ మరో ప్రకటన చేయడంతో ప్రజలు అయోమయానికి గురి చేస్తుందని ఇలా ప్రకటనలు కాకుండా పండుగ నిర్వాహణపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, వీరవెల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: సద్దుల బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని పెద్ద చెరువువద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. బతుకమ్మ ఆడే చెరువు పరిసరాలతో పాటు నిమజ్జన ప్రాంతాల వద్ద లైటింగ్, పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి, మైదానాలను చదును చేయడం వంటి పనులు పరిశీలించారు. అక్టోబర్ 2న స్థానిక యతిరాజారావు పార్కులో నిర్వహించే రావణ వధ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాల తెలంగాణ జీవన ప్రతిబింబం బతుకమ్మ అని, ప్రకృతితో మమేకమై పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే ఈ పూల పండుగను మహిళలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ సంధ్యారాణి, నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, గుండాల నర్సయ్య, చిత్తలూరి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహబూబాబాద్ రూరల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మరిపెడ: డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు..

మహబూబాబాద్ రూరల్: మానుకోట శ్రీరామకృష్ణ విద్యాలయం 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనంతాద్రి శ్రీజగన్నాథ వెంకటేశ్వర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అక్కెనపల్లి మధుసూదన్, సాయిప్రసాద్, వంశీ, ప్రదీప్, శ్రీను, పవన్, సాంబశివ, శ్రీపాల్ పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2012–2014 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరారు. అలనాటి తీపీ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా



మహబూబాబాద్ అర్బన్: గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఐక్యవేదిక జిల్లా బాధ్యులు శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేకర్ సెంటర్‌లో గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, లచ్చిరాం నాయక్, వీరస్వామి, గోపికృష్ణ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: గుర్రం జాషువా స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న అసమానతలపై తిరుబాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి అన్నారు. జాషువా జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. చీపిరి యాకయ్య, మందుల మహేందర్, పులిపాక నాగరాజు, భాగ్యమ్మ, యుగేందర్, అశోక్, రాంమూర్తి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి



మహబూబాబాద్ అర్బన్: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు



కురవిలో..

మహబూబాబాద్ అర్బన్/నెహ్రూసెంటర్/ కురవి: దేశ స్వాతంత్ర్యం కోసం చిరుప్రాయంలోనే ఉరికంబాన్ని ముద్దాడిన యువ కిశోరం భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలోని ప్రతి పేద వాడికి ఆరోగ్యపరంగా సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతోనే రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధి పథకానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, మిట్టకంటి రామిరెడ్డి, నాగేశ్వర్‌రావు, మహేందర్ రెడ్డి, సతీష్, వెంకన్న, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

కులహత్యలకు వ్యతిరేకంగా పోరాడాలి

- న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గార్ల: కుల హత్యలు, కుల దుహంకార అమానుష్య కాండకు వ్యతిరేకంగా పోరాడాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. సత్యశోధక సమాజ ఉత్సవాలను పురస్కరించుకొని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం గార్ల పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గార్లలోని జ్యోతిబాపూలే, సావిత్రిబాపూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అస్తవ్యస్తంగా ఉన్న అసత్యాలు రాజ్యమేలుతున్నాయని, వీటిని రూపుమాపటానికి జ్యోతిబాపూలే సత్యాన్వేషణ చేయడానికి సత్యశోధకు సమాజాన్ని స్థాపించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగవిజయ్, నందగిరి వెంకటేశ్వర్లు, జడ సత్యనారాయణ, జి సక్రు, పద్మ, తిరుపతమ్మ, రాకేష్, వీరభద్రం, గౌని భద్రయ్య, జడ ఐలమ్మ, మల్లేష్, కవిత పాల్గొన్నారు.

మండపాల వద్ద అన్నదానాలు



మహబూబాబాద్ రూరల్: అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



గార్ల: మర్రిగూడెంలో అన్నదానం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్



గూడూరులో..

మహబూబాబాద్ రూరల్ : మున్సిపాలిటీలో 28 వార్డు పరిధిలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గంగపుత్ర సంఘంలో ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఉమ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు.

గూడూరు: మండల కేంద్రంలో నర్సంపేట వైపు జాతీయ రహదారి పక్కన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెలకొన్న దుర్గాదేవి అమ్మవారు ఆదివారం చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాంకుడోతు కొమ్మాలునాయక్ దంపతులు మండపం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

గార్ల: మండలంలోని మర్రిగూడెం దుర్గాదేవి విగ్రహ మండపం ఎదుట అన్నదానం కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆదివారం ప్రారంభించారు

మరిపెడ: మున్సిపాలిటీ కేంద్రంలోని ఎర్రగడ్డ బజారులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బయ్యా భిక్షం, ఎడెల్లి పరశురాములు, బాదావత్ హతీరాం పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీ స్కూల్ సెంటర్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జైన్‌భవన్‌లో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాత కాత్యాయని అమ్మవారి రూపంలో దర్శనమిచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

శునకాలకు రేబిస్ టీకాలు

డోర్నకల్: కుక్కలనుంచి సంభవించే రేబిస్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్ కోరారు. స్థానిక జెడ్పీ హెచ్‌ఎస్‌లో ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించి, కుక్కలను టీకాలు వేశారు.

వ్యక్తి ఆత్మహత్య

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కట్ల శంబులింగం(57) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసిక క్షోభతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ

కేసముద్రం: బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని అమీనాపురం, ఉప్పరపల్లి, అర్పనపల్లి గ్రామాలకు చెందిన 100 మంది కోలాటాల మహిళలకు, సమ్మిగౌడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో చీరలను ఆదివారం అందజేశాడు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి అశోక్, లక్కాకుల సత్యనారాయణ, మోడెం రాజు, సత్యనారాయణ, రాము, సారంగపాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

పెద్దవంగర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన అనపురం లక్ష్మీనారాయణ, దుర్సోజు స్వరూప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, నాయకులు కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, శ్రీరాం సుధీర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డోర్నకల్: హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. స్థానిక అశోక్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20మంది కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వీరస్వామి, ప్రవీణ్, మల్లయ్య పాల్గొన్నారు.

పరమేశ్వర్‌కు కీర్తిరత్న పురస్కారం



పెద్దవంగర: మండలానికి చెందిన ప్రముఖ కవి, రచయిత బిర్రు పరమేశ్వర్‌కు 'కీర్తిరత్న' పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ చెందిన భవానీ సాహిత్యవేదిక వారు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు అందజేశారు.

నివాళి

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో వాలీబాల్ కోచ్ కందునూరి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కొమురయ్య విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భిక్షపతి, సాంబయ్య, మల్లారెడ్డి, వద్దిరాజు దేవేందర్, వద్దిరాజు వెంకన్న పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి

బయ్యారం: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలకం శంకరయ్య(68) ఆదివారం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శంకరయ్య మృతికి టీపీటీఎఫ్ జిల్లా నాయకులు కొమిరె ఉప్పలయ్యతోపాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

సీపీఐ నాయకుడి..

బయ్యారం: సీపీఐ మండల సీనియర్ నాయకుడు పుసులూరి రంగయ్య(70) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, నాయకులు అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మ, కుమార్, వెంకన్న నివాళులర్పించారు.

భద్రాచలం సభకు తరలిన గిరిజనులు

బయ్యారం: గిరిజన మండలమైన బయ్యారంలో ఆదివారం రెండు ప్రధాన కులసంఘాలు తమ హక్కుల కోసం రెండు ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. లంబాడీలు మానుకోట ర్యాలీకి మోటార్ సైకిళ్ల ద్వారా వెళ్లగా ఆదివాసీలు భద్రాచలం సభకు వాహనాల ద్వారా తరలివెళ్లారు.

గంగారం: భద్రాచలం ధర్మయుద్ధ సభకు ఆదివాసీ సంఘాల నాయకులు, తుడుందెబ్బ నాయకులు తరలివెళ్లారు.

ఆత్మగౌరవ సభకు..

నెల్లికుదురు: లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ పోరాట జాక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన లంబాడీల ఆత్మగౌరవ సభకు మండల కేంద్రం నుంచి గిరిజనులు అధిక సఖ్యలో తరలివెళ్లారు.

యాసంగి బోనస్ రైతులకు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కేసముద్రం: యాసంగి వరి ధాన్యం బోనస్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు చెల్లించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి జ్యోతిరావు పూలే సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు జరిపిన వడ్లకు బోనస్ చెల్లించకుండా జాప్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా బోనస్ డబ్బులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లోజు రామ్మోహనాచారి, గుగులోతు లక్ష్మణ్, వీరస్వామి, రాజు, సమ్మయ్య, హబీబ్ పాల్గొన్నారు.